క్లుప్తంగా

7న మండల సమావేశం

నగరి : ఈ నెల 7వ తేదీ ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సతీష్ తెలిపారు. కార్యాలయ ఆవరణలోని వెలుగు సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్‌కు దరఖాస్తులు

పుత్తూరు: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.కోటేశ్వరయ్య కోరారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ 55 శాతం మార్కులతో పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఈ నెల 7వ తేదీలోపు ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. 8న కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని వెల్లడించారు. నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

కావునూరు పాఠశాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

నిండ్ర: విద్యార్థులు పాఠ్యాంశాలను బాగా చదివి అర్థం చేసుకోవాలని ఎంఈవో శ్రీధర్‌రాజు తెలిపారు. ఆయన శుక్రవారం కావునూరు పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు.

కుష్టు రోగులపై వివక్ష తగదు


సర్వే రికార్డు పరిశీలిస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : కుష్టు రోగులపై వివక్ష తగదని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆముదాల ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన సందర్శించారు. కుష్టు బాధితుల గుర్తింపునకు చేపట్టిన ఇంటింటి సర్వే రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులను చిన్నచూపు చూడకుండా అదరించాలని కోరారు. చక్కటి మందులు వాడితే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో వ్యాధి నివారణ మందులు లభిస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్‌ఎం జయలక్ష్మి పాల్గొన్నారు.

విజయపురంలో మోస్తరు వర్షం

విజయపురం : మండంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ కాయడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు కలిగి వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వేరుశనగ నూర్పిడి చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

నారాయణవనం: మండల కేంద్రమైన నారాయణవనంలోని ధర్మరాజుల ఆలయంలో మహాభారత యజ్ఞం ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను 11 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దేశప్పరెడ్డి తెలిపారు. ఆలయంలో శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. నవగ్రహ, వాస్తు శాంతి పూజలను నిర్వహించి, వస్త్రాన్ని ఆలయంలోని ధజస్తంభంపైకి అధిరోహింపజేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం పరిసర గ్రామాల్లో సత్యభామ సమేత శ్రీకృష్ణుడు, పాండవుల ఉత్సవమూర్తులను ఊరేగించనున్నట్లు దేశప్పరెడ్డి తెలిపారు. ఈ నెల 6వ తేదీన సాయంత్రం అశ్వవాహన సేవ, 7వ తేదీ సాయంత్రం ఒడయార్ ఉత్సవం, 8వ తేదీ సాయంత్రం సర్వభూపాల వాహన సేవ, 9న ఉదయం అర్జున తపస్సు, సాయంత్రం ఉత్తర గోకర్ణ ఉత్సవం, 10న శనివారం ఉదయం అలుగు ఉత్సవం, రాత్రి గరుడ సేవ, 11న ఆదివారం సాయంత్రం భక్తుల అగ్నిగుండ ప్రవేశం, రాత్రి సింహ వాహన సేవలు నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 12న సోమవారం రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

4న ఛాంబర్ ఆఫ్ కామర్స్ క్రీడా సంబరాలు

తిరుపతి కల్చరల్ : తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన క్రీడా సంబరాలు నిర్వహించనున్నట్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు శుక్రవారం తెలిపారు. నిత్యం తమ లావాదేవీలతో బిజీగా గడిపే వ్యాపారుల్లో మానసిక ఉల్లాసం కలిగించాలనే ఉద్దేశంతో ఈ సంబరాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు అవిలాల వద్ద ఓ ప్రైవేట్ క్రీడా కోర్టులో ఎస్పీ సుబ్బరాయుడు చేతుల మీదుగా సంబరాలు ప్రారంభమతాయని వెల్లడించారు. వ్యాపారులందరూ పాల్గొనాలని కోరారు.

ఉపాధి కూలీలు.. అందని వేతనాలు


ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ఉపాధి కూలీల రెక్కల కష్టంతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది. మండుటెండలో చెమటోడ్చిన వారికి కూలి నగదు చెల్లించకుండా వేధిస్తోంది. మూడు నెలలుగా వేతనాలు మంజూరు చేయకుండా ఇబ్బంది పెడుతోంది. పొట్ట కూటి కోసం పనిచేస్తే పస్తులతో అవస్థలు పడే దుస్థితి దాపురించిందని కూలీలు ఆవేదన చెందుతున్నారు. సర్కారు తీరుతో మళ్లీ వలసబాట పట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. బడుగు బతుకులను ఇక్కట్ల పాలు చేయడం సరికాదని మండిపడుతున్నారు.

- 3 నెలలుగా నిలిచిపోయిన చెల్లింపులు
- పట్టించుకోని అధికారులు
- కూలి సొమ్ము కోసం తప్పని ఎదురుచూపులు

పాలసముద్రం : నియోజకవర్గంలో ఉపాధి కూలీలకు మూడు నెలలుగా ప్రభుత్వం కూలి నగదు చెల్లించడంలేదు. సుమారు రూ.1.10 కోట్ల వరకు కూలి సొమ్ము చెల్లించాల్సి ఉంది. పనులు చేసి 12 వారాలు గడుస్తున్న వేతనాలు అందకపోవడంతో కూలీలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి కూలీలకు ఏవారంలో ఎంత పని చేసుంటే, దానికి సంబంధించిన మొత్తం వేతనం వారి ఖాతాల్లో నేరుగా జమ అయ్యేది. అయితే మే 21వ తేదీ నుంచి ఈ రోజు వరకు కూలీలకు చెల్లించాల్సిన సొమ్ము మొత్తం పెండింగ్‌లోనే ఉంది.

పెరిగిన అనాసక్తి

మూడు నెలల క్రితం వరకు కూలీలకు వేతనాలు మూడు, నాలుగు రోజుల్లోనే వారి ఖాతాల్లో జమవుతుండేవి. దీంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపేవారు. ఇప్పుడు సక్రమంగా చెల్లింపులు లేక పోవడంతో కూలీల్లో సైతం అనాసక్తి పెరిగింది. ప్రస్తుతం వేతన బకాయిలు తమ ఖాతాలో పడ్డాయో లేదో తెలుసుకునేందుకు బ్యాంకులు, పోస్టాఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల కూలీలు తమ డబ్బుల కోసం క్షేత్ర సహాయకుల ఇళ్లు, మండల పరిషత్ కార్యాలయయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

రూ.కోటి దాటిన బకాయిలు

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 38,874 జాబ్ కార్డులుండగా 77,653 మంది కూలీలు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఉపాధి చట్టం ప్రకారం కూలీలు పనిచేసిన 21 రోజుల్లోనే వేతనాలు అందించాలి. కానీ 12 వారిలైనా చేసిన పనులకు సంబంధించిన వేతనాలు అందడం లేదు. మూడు నెలలకు సుమారు రూ.1.10 కోట్లకు పైగా కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఇబ్బందిగా ఉంది



ఇంట్లో ఖాళీగా ఉండలేక ప్రభుత్వం కల్పించిన ఉపాధి హామీ పనులకు వెళ్లాను. మండుటెండల్లో రోజుకు నాలుగైదు గంటల పనులు చేశాం. చెమటోడ్చి పని చేసినా సమయానికి డబ్బులు చెల్లించడం లేదు. అధికారులు చొరవ తీసుకుని సొమ్ము విడుదల చేయించి మమ్మల్ని ఆదుకోవాలి. ఉపాధి పనులతో జీవనోపాధి దొరకుతుందనే ఆశతో పనులు చేశాం. ఇన్ని రోజులు బకాయి పెడితే ఇబ్బందిగా ఉంది.

– రవ్వలరాణి, కన్నికాపురం, పాలసముద్రం మండలం

ఆందోళనకు దిగుతాం



చేసిన పనికి వేతనాలు చెల్లించకపోతే ఎలా? 12 వారాల పాటు డబ్బులు ఇవ్వకుంటే మా కుటుంబాలు ఎలా బతకాలి. ఇప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ కూలీల సమస్య పరిష్కరించాలి. వేతన బకాయిలు చెల్లించకుంటే ఆందోళనకు దిగుతాం.

– పొందు, పెనుమూరు

త్వరలోనే చెల్లిస్తాం



ఉపాధి పనులు చేసిన కూలీలందరికీ త్వరల్లో వేతనాల చెల్లింపు ఉంటుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన బడ్జెట్ ఆమోదం పొందింది. త్వరలోనే బకాయి వేతనాలు మొత్తం కూలీల ఖాతాల్లో జమవుతాయి. ఈ విషయంలో ఆందోళన చెందనవసరం లేదు. వేతనాలు అందలేదని ఎవరూ పనులు మానవద్దు.

– రామనాథరెడ్డి, ఎంపీడీఓ

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

గంగాధర నెల్లూరు : పసిపిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరగాలంటే తల్లిపాలు అవసరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బిందుమాలతి తెలిపారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వాణి, తులసి పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం


విజయపురంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విజయపురం : బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. విజయపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. దీంతో పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. శారీరక ఎదుగుదల బాగుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ బోధన


విద్యాసామగ్రి అందిస్తున్న ప్రిన్సిపల్ హేమలత

పాలసముద్రం : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. శుక్రవారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, బ్యాగ్ అందజేస్తున్నామని, చక్కటి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వెల్లడించారు. పిల్లలకు కూడా క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత భవిష్యత్ పొందవచ్చని సూచించారు. తల్లిదండ్రులు సైతం పిల్లలను ఇంటి వద్ద చదివించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

ఘనంగా వసంతోత్సవం



స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేస్తున్న అర్చకులు, విశేషాలంకరణలో శ్రీవళ్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

శ్రీకాళహస్తి: పట్టణంలోని విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవళ్లీ, దేవసేన సమేత కుమారస్వామికి ఆడికృత్తిక వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయం వద్ద ఉన్న వసంత మండపం వద్దకు స్వామి అమ్మవార్లను వేంచేపు చేశారు. శ్రీవళ్లీ, దేవసేన సమేత కుమారస్వామికి చందనం, క్షీరం, పెరుగు, పసుపు, కుంకుమ, నారికేళ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత స్వామి, అమ్మవార్లను పట్టణంలో ఊరేగించారు. సాయంత్రం ధ్వజావరోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.



పూజలు చేస్తున్న, అర్చకులు, హాజరైన భక్తులు

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు


తహసీల్దార్ రవికుమార్

నగరి : నగరి తహసీల్దార్‌గా డి.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న రవికుమార్ నగరికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశమై స్థానిక అంశాలపై చర్చించారు. తనకు గతంలో నగరిలో ఆర్‌ఐగా, డీటీగా పనిచేసిన అనుభవం ఉందని, రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలు రాకుండా త్వరితగతిన పరిష్కరించడానికి ప్రయత్నిస్తానన్నారు.

జీడీ నెల్లూరులో..


బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

గంగాధర నెల్లూరు : జీడీ నెల్లూరు తహసీల్దార్‌గా వి.చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ తులసీరామ్, సర్వేయర్ గణేష్ పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

పాలసముద్రం : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి ధరణి సూచించారు. శుక్రవారం పాలసముద్రం సచివాలయ ఆవరణంలో సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ అయ్యప్ప నేతృత్వంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ధరణి మాట్లాడుతూ కలుషిత నీటిని తాగితే డయేరియా బారిన పడే ప్రమాదముందన్నారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరవని తెలిపారు. దోమ కాటుకు గురి కాకుండా తెరలు వాడాలని కోరారు. అనంతరం బోరు మోటారు పక్కన పరిసరాలను పరిశుభ్రం చేశారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామి ఆలయంలో మూడు రోజులుగా సాగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారం సాయంత్రం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ముందుగా స్వామివారిని ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపి తోమాల సేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం, భాష్యకార్ల గుడి వద్ద శాత్తుమొర జరిపించారు. అనతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, ఉత్సవ మూర్తులను, ప్రధాన కుంభాన్ని విమాన ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ సోమశేఖర్ పాల్గొన్నారు.

మర్మకళా వైద్యంతో రోగాలు నయం


మర్మకళా వైద్యం చేస్తున్న డాక్టర్ హరిప్రసాద్ బృందం

పుత్తూరు: భారతీయ ప్రాచీన మర్మకళా వైద్యం ద్వారా అనేక దీర్ఘకాలిక రోగాలను నయం చేయవచ్చునని చెన్నైకి చెందిన ప్రముఖ మర్మకళా వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.హరిప్రసాద్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం మర్మకళా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మానవుని పాదాలు, అరచేతిలో వివిధ రకాలుగా ఒత్తిడి కలిగించడం ద్వారా శరీరంలోని 7 వేల నాడీ మండలంలో చలనం ఏర్పడుతుందని తెలిపారు. తద్వారా రోగాలు నయమవుతాయని వెల్లడించారు. రోగాన్ని బట్టి నెలకు ఒకటి లేక రెండు పర్యాయాలు మర్మకళా వైద్యం చేయించుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని వెల్లడించారు. అనంతరం 55 మందికి వైద్య సేవలు అందించారు. పుత్తూరులో ప్రతినెలా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ వామనన్, విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వాద్వా

నగరి : ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని, నాయకత్వ లక్షలు పెంపొందుతాయని తిరుపతి ఎన్‌సీసీ కార్యాలయ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వాద్వా తెలిపారు. స్థానిక ఎస్‌జీఎస్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం 5ఏ బెటాలియన్ బాలికల ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యత పెంపొందించడంతోపాటు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించేలా శిక్షణ ఇచ్చే ఉద్దేశంతోనే ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్) స్థాపించినట్లు తెలిపారు. సమాజ సేవలో యువత భాగస్వామ్యానికి ఒక వేదికను సృష్టించడం, వారి మధ్య స్నేహాన్ని పెంపొందించడమే లక్ష్యమన్నారు. తల్లిదండ్రులకు విద్యార్థినులు ఎన్‌సీసీ ఆవశ్యకతను తెలిపి ఇందులో భాగస్వాములు కావాలని సూచించారు. డీవైఈవో ప్రభాకర్ రాజు మాట్లాడుతూ పౌరుల్లో సహృదయ, క్రమశిక్షణ, లౌకిక దృక్పథాన్ని పెంపొందించమడే ఎన్‌సీసీ లక్ష్యమన్నారు. నిర్మాణాత్మక కార్యకలాపాలలో యువత శక్తిని, ఉత్సాహాన్ని పెంచడానికి ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా బాలికలు ఎన్‌సీసీ లాంటి సామాజిక సేవా సంస్థల్లో చేరడం దేశాభివృద్ధికి తోడ్పడటమేనన్నారు. విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కూడా వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు నాయబ్ సుభేదార్ అజిత్ కుమార్‌జా, నాయక్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయురాలు పార్వతీదేవి తదితరులు పాల్గొన్నారు.

ద్రౌపదిదేవి తిరనాళ్లు ప్రారంభం


ధ్వజారోహణం కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు

నగరి : మున్సిపల్ పరిధిలోని చింతలపట్టిడలో శుక్రవారం ద్రౌపదిదేవి తిరనాళ్లు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ధ్వజారోహణం చేశారు. అనంతరం మహాభారతం హరికథాగానాన్ని డాక్టర్ ఎంవీ నటరాజన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ వరకు తిరనాళ్లు జరుగుతాయన్నారు. ప్రతిరోజూ ఆలయం వద్ద మహాభారత హరికథ, భారత ఘట్టాలను నాటక ప్రదర్శన ఉంటాయని వివరించారు. 5న బకాసుర కుంభం, 6న కల్యాణం, 7 ప్రత్యేక దీపపు పూజ, 8న చర్చావేదిక, 9న అర్జున తపస్సు, 10న రథసప్తమి ఉత్సవం, 11న అగ్నిగుండ ప్రవేశం, 12న వసంతోత్సవం నిర్వహిస్తామన్నారు.

పాముకాటుతో విద్యార్థినికి అస్వస్థత


తిరుపతిలో వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

నిండ్ర : మండలంలోని కూనమరాజుపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని పాముకాటుతో అస్వస్థతకు గురైంది. గోవిందరాజులు కుమార్తె హర్షిత(13) విజయపురం మండలం పన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఆమె గురువారం రాత్రి ఇంటి వద్ద నిద్రించింది. ఆ సమయంలో పాము కాటు వేసింది. గమనించని విద్యార్థిని శుక్రవారం యథావిధిగా పాఠశాలకు వెళ్లింది. విషం ప్రభావం చూపడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఉపాధ్యాయులు వెంటనే ఆమెను తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని పేర్కొంటూ తిరుపతి రుయాకు రిఫర్ చేశారు. ప్రస్తుతం విద్యార్థి రుయాలో చికిత్స పొందుతోంది. విద్యార్థినికి మాటలు రావడం లేదని తల్లిదండ్రులు తెలిపారు.

ఏపీలో ప్రకృతి వ్యవసాయం భేష్!


వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న తమిళనాడు ప్రతినిధుల బృందం

తిరుపతి రూరల్ : ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయ విధానాలు భేషుగ్గా ఉన్నాయని తమిళనాడుకు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి సంతశీల నాయర్ కొనియాడారు. తమిళనాడు ప్రతినిధుల బృందం శుక్రవారం తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలో ఆదర్శరైతు అయ్యప్పనాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా పంచగవ్య, దశపర్ణి, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, చేప ద్రావణం, పుల్లజెముడు కషాయాల తయారీని పరిశీలించారు. వాటి ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ విధానాలు, వాటికి ప్రభుత్వాల ప్రోత్సాహంపై ఆరా తీశారు. రైతు అయ్యప్పనాయుడుని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారి షణ్ముగం, కృష్ణారావు, పట్టాభిరెడ్డి, రవిచంద్ర, గోకుల్, కార్తీక్, భాస్కర్, సెల్వరాజ్, కృష్ణామూర్తి, డేవిడ్ పాల్గొన్నారు.

సబ్సిడీపై మొక్కజొన్న జొన్నల పంపిణీ


రైతులకు మొక్కజొన్న, జొన్నలు పంపిణీ చేస్తున్న సాయిసుధ, రమ్య

గుడిపాల: పాడి రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న, జొన్నలు పంపిణీ చేస్తున్నట్లు గుడిపాల పశువైద్యాధికారి సాయిసుధ, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ రమ్య తెలిపారు. వారు శుక్రవారం పాపసముద్రం, 189 కొత్తపల్లె, రామాపురం, వసంతాపురం, బొమ్మసముద్రం రైతు భరోసా కేంద్రాల్లో మొక్కజొన్న, జొన్నలను రైతులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ మండలానికి ఐదు టన్నుల మొక్కజొన్న, జొన్నలు వచ్చాయన్నారు. 70 శాతం సబ్సిడీ పోను మొక్కజొన్న 5 కిలోల బ్యాగు రూ.90, జొన్నలు 5 కిలోల బ్యాగు రూ.115లకు ఇస్తున్నట్టు చెప్పారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని కొంగారెడ్డిపల్లెలో ఉన్న సంసిద్ధ్ క్యాంపోర్డ్ పాఠశాల, గిరింపేట మున్సిపల్ హైస్కూళ్లలో ఈ నెల 4వ తేదీ నుంచి 14 రోజులు యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు యోగాచార్యులు నరేంద్ర తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్ల పైబడిన వారు ఈ తరగతుల్లో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 8247609140 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా నాగాలమ్మ జాతర


నాగాలమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న

చిత్తూరు రూరల్: ఆడి నెలను పురస్కరించుకుని చిత్తూరు ఎస్టేట్‌లోని ఆటోనగర్‌లో శుక్రవారం కార్మికులు, యజమానుల ఆధ్వర్యంలో నాగాలమ్మ జాతరను అట్టహాసంగా నిర్వహించారు. వీధిలో అమ్మవారిని కొలువుదీర్చి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. డప్పు వాయిద్యాల హోరు నడుమ భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలి నైవేద్యంగా సమర్పించారు. మండపం ఆవరణలోని పుట్టలో పాలు పోసి నాగాలమ్మను కొలిచారు. సాయంత్రం అమ్మవారి ఊరేగించారు. ఆదివారం నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తామని జాతర పెద్దలు తెలిపారు.